నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
బుధవారం, తెలంగాణ
03 డిసెంబర్ 2025


## ఇందిరమ్మ కాలనీలో కరెంట్ సమస్యలను బాగు చేయండి

### గోకరి సురేష్ గౌడ్



**రాజేంద్రనగర్, డిసెంబర్ 2 (నినాదం):** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 18 వ వార్డు లో నీ కరెంటు సమస్యలను మంగళవారం ఏ ఈ మల్లేష్ కు తెలియజేసిన గోకరి సురేష్ గౌడ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ, సాయి ద్వారకామై కాలనీలో త్రీఫేస్ కరెంటు తో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఏఈ ఎలక్ట్రికల్ మల్లేష్ కు తెలియడం జరిగిందన్నారు. స్పందించిన ఏ ఈ త్రీఫేస్ లైన్లు సమస్యను పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తామని ఆయన తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ మ్యాన్ నరేందర్, నాయకులు ప్రవీణ్ గౌడ్, ఓంకార్ ,రమేష్ , తదితరులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుతున్న ఆటోడ్రైవర్



**అల్వాల్, డిసెంబర్ 2 (నినాదం): నవంబర్** 29న ఆంధ్ర లోని విజయవాడ నుంచి బొల్లారం తుర్కపల్లి నుంచి గృహప్రవేశం నిమిత్తం వచ్చిన షేక్ సన తిరుగు ప్రయాణం చేద్దామని ట్రైన్ కోసం షఫీల్ గూడ వెళ్ళినారు. తరువాత ట్రైన్ మిస్ అవ్వడంతో తిరిగి బొల్లారం తుర్కపల్లి ఆటోలో రాత్రి సమయంలో వచ్చినారు. వారు తీసుకువెళ్లిన అన్ని లగేజ్ బ్యాగులు ఇంట్లోకి తెచ్చుకున్నారు కానీ ఒక లగేజ్ బ్యాగు అందులో 18 తులాల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నవి అట్టి బ్యాగును ఆటోలోనే మర్చిపోయినారు. మరుసటి అనగా 30-11-2025 నాడు బ్యాగులు చెక్ చేయగా అందులో ఒక బ్యాగ్ మిస్ అయిందని గమనించి అందులోనే బంగారు నగలు ఉన్నాయని గమనించి వెంటనే అల్వాల్ పోలీస్ స్టేషన్ కి ఆదివారం మధ్యాహ్నం వచ్చి పోలీసులను ఆశ్రయించగా, అక్కడ ఎస్ఐ చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించి, సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్వాల్ తిమ్మప్ప ఆదేశాలను అనుసరిస్తూ అట్టి ఆటోను మూడు గంటల వ్యవధిలోని ట్రేస్ చేసి అల్వాల్ పోలీస్ స్టేషన్ కు రప్పించినారు. బాధితురాలుకు సంబంధించిన బ్యాగును మరియు అందులో ఉన్న 18 తులాల విలువైన బంగారు నగలను సదరు బాధితురాలికి అప్పగించడం జరిగింది. ఆటోలో మర్చిపోయిన అట్టి బ్యాగును మరియు బంగారు నగలను సదరు ఆటో డ్రైవర్ అయినటువంటి రాజేష్ బాధ్యతతో తిరిగి తెచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. అలాగే, ప్రయాణం చేసేటప్పుడు విలువైన వస్తువులు జాగ్రత్తగా ఉంచుకోవాలని ఎస్సై చంద్రశేఖర్ గారు సదురు మహిళలకు సూచించడం జరిగింది.

## పర్యావరణాన్ని కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత




**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 2 (నినాదం) :** పర్యావరణాన్ని కాపాడటం ప్రభుత్వము, సంస్థలతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విద్యార్థులకు ప్రాథమిక దశనుండే పర్యావరణం పై అవగాహన కల్పించాలని మాజీ టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ అండ్ ఫౌండర్ సొంటి రెడ్డి పున్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ప్లే కార్డ్స్ తో పర్యావరణం పరిరక్షిద్దాం ఇది అందరి బాధ్యతగా తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన వినియోగం తగ్గించడం,అవసరం లేనప్పుడు వ్యక్తిగత వాహనం ఉపయోగించకూడదని సూచించారు.కార్‌పూల్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉపయోగించడం సైకిల్ లేదా నడకను ప్రోత్సహించడం మొక్కలను క్రమం తప్పకుండా నీరు పెట్టడం, వాటిని రక్షించడం ప్రతి కుటుంబం కనీసం 1మొక్కను నాటి వాటిని సంరక్షించడం లక్ష్యంగా పెట్టుకోవడం అలవర్చుకోవాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం,జ్యూట్ లేదా క్లాత్ బ్యాగ్ ఉపయోగించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఇండ్లలో ఏర్పడే చెత్తను తడి పొడిగా వేరుచేసి చెత్తను సేకరించే ఆటోలకే అందించాలన్నారు. ఇంటిలోనే చిన్న ఎరువును తయారు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. నీరు, విద్యుత్ ఆదా చేయడం అలవర్చుకోవాలన్నారు. వర్షపు నీటిని సేకరించే పద్ధతులు పాటించడం,దగ్గర్లోని ఏరియాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలలో పాల్గొనడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే కాలుష్యం నివారణకు చేపట్టవలసిన కార్యక్రమాలను అవగాహన కల్పించాలన్నారు.చిన్న పనులు కూడా పెద్ద మార్పు తీసుకురాగలమని వివరించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత ర్యాండమైజేషన్



**రంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 2 (నినాదం) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని రంగారెడ్డి జిల్లాలో రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల సర్పంచ్, 4668 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతోపాటు, ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు. అనంతరం పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రీపోలింగ్ కు అస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, నోడల్ అధికారి శ్రీలక్ష్మి, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు మాత్రమే రక్షకులు కాదు.. అవగాహన కలిగిన ప్రతి పౌరుడు రక్షకుడే

### ఎస్పీ సునీతా రెడ్డి






**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 2(నినాదం):** పోలీసులు మాత్రమే రక్షకులు కాదని, అవగాహన కలిగిన ప్రతి పౌరుడు కూడా రక్షకుడే అని వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజల్లో సైబర్ భద్రతపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు సైబర్ మోసాలకు పూర్తి విరామం పేరుతో 6 వారాల ప్రచార కార్యక్రమాన్ని డిసెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజిపీ షికా గోయల్ ఆధ్వర్యంలో సీనియర్ అధికారుల సమక్షంలో హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో ప్రభుత్వ వైద్యకళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర జూనియర్ కళాశాల, విద్యార్థినీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైబర్ అవగాహన ప్రచారాన్ని జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ప్రారంభించారు. యువత, విద్యార్థుల్లో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు 6 వారాలపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో మీ భద్రత మీ చేతుల్లోనే ఉందని, అవగాహనే ఆయుధం.. ప్రతిజ్ఞ చేసిన ప్రతి విద్యార్థి తనతో పాటు తన కుటుంబాన్ని కూడా రక్షించే సైబర్ వారియర్ అవ్వాలని ప్రేరణాత్మకంగా అన్నారు. కళాశాల విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి సైబర్ నేరాల పెరుగుతున్న మార్పులు, వ్యూహాలు, వాటి నివారణ చర్యలపై వివరించారు. ప్రతి ఒక్కరూ సైబర్ ప్రపంచంలో ఒక జాగ్రత్తపడ్డ పౌరుడుగా ఎదగాలని, ఎవరికైనా మోసం జరిగితే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్ కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. డిజిటల్ మోసాలు, బ్లాక్ మెయిలింగ్, డీప్‌ఫేక్‌లు, నకిలీ యాప్‌లు, చిన్నారుల సైబర్ రక్షణ వంటి అంశాలపై రాష్ట్రంలోని పౌరులందరికీ ప్రత్యేక మార్గదర్శకాలు అందిస్తారని చెప్పారు. ప్రతి పోలీ స్టేషన్ లో వారానికొక కార్యక్రమం నిర్వహించాలని, టి జి సి ఎస్ బి అందించే పోస్టర్లు, ఆడియో,వీడియో క్లిప్లు ప్రజాస్థలాల్లో ప్రదర్శించ బడతాయని, 6 వారాల ప్రచార కార్యక్రమం ప్రతి వారం ఒక ప్రత్యేక థీమ్ ఆధారంగా సైబర్ నేరాల విధానాలు, వాటి నివారణ చర్యలు, విద్యార్థులు ప్రజలలో సురక్షిత డిజిటల్ అలవాట్లను పెంపొందించేందుకు పోలీసుశాఖ సమగ్ర అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ అవగాహనలో పోలీస్‌స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, రవాణా కేంద్రాలు, ప్రజా స్థలాలు అన్నీ భాగస్వామ్యం అవుతాయని ఎస్పీ తెలిపారు. విద్యార్థులను డిజిటల్ భద్రతపై నిబద్ధతగా నిలబడేలా ప్రత్యేకమైన "సైబర్ భద్రత ప్రతిజ్ఞ" చేయించారు. గోడపత్రికను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డీఎస్పీ బాలాజీ నాయక్, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐ రాంబాబు, ఆత్మకూరు సిఐ శివకుమార్, ఇన్స్పెక్టర్లు అప్పల నాయుడు, శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్సై రవి ప్రకాష్, సైబర్ క్రైమ్ పోలీసు సిబ్బంది, ఆయా కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశ డే సందర్భంగా అవగాహన సమావేశం



**మహబూబాబాద్ డిసెంబర్ 02(నినాదం):** ఆశ దేను పురస్కరించుకుని జిల్లాలోని ఆశ కార్యకర్తల సేవలను గుర్తిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒక ప్రత్యేక జూమ్ సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు ముందుబాటుగా వ్యవహరిస్తూ, గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను చేరవేయడంలో అత్యంత ముఖ్యమైన భూమిక పోషిస్తున్నారని తెలిపారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాల లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.ANC చెక్‌అప్స్, రక్తపరీక్షలు, హీమోగ్లోబిన్ పరీక్షలు, బి.పీ పరీక్షలు, అల్ట్రాసౌండ్ వంటి సేవలను సమయానుకూలంగా అందించేందుకు ఆశలు కుటుంబ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. జబ్బులు, ప్రమాద సూచనలు, అనీమియా, హై రిస్క్ గర్భధారణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లాలో సిజేరియన్ శాతం తగ్గించి సాధారణ ప్రసవాలు పెంచేందుకు గర్భిణి స్త్రీలకు సరైన అవగాహన ఇవ్వాలని తెలిపారు.ప్రసూతి సేవలు అందిస్తున్న PHCలు, CHCల్లో డెలివరీ పాయింట్లు బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.గ్రామాల్లో 100% టీకాకరణ సాధించేందుకు ఆశలు కృషి చేయాలని ఆదేశించారు.పిల్లల్లో పోషకాహార లోపం రాకుండా రియల్ టైమ్ మానిటరింగ్ చేయాలని సూచించారు. గర్భిణులకు IFA టాబ్లెట్లు, కాల్షియం, పోషకాహార మార్గదర్శకాలను తప్పకుండా అందించాలని తెలిపారు.బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాదుల ల నియంత్రణ కోసం 30 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తికి స్క్రీనింగ్ కార్యక్రమాలను బలోపేతం చేయాలని సూచించారు.NCD రిజిస్టర్‌ను అప్డేట్ చేయడం, రెగ్యులర్ ఫాలోఅప్ చేయడం, మందుల సమయానుకూల సరఫరాను నిర్ధారించాలన్నారు. జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శిశువులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి,వెచ్చని బట్టలు ధరించడం,రాత్రి వేళలు బయట తిరగక పోవడం,వేడి ఆహారం తీసుకోవడం వంటి సూచనలను ప్రజలకు చేరవేయాలని తెలిపారు.ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్నిరియల్ టైమ్‌లో నమోదు చేయడం,పోర్టల్ డేటా అప్‌డేట్ చేయడం,హౌస్-హోల్డ్ సర్వే ఖచ్చితత్వం పాటించడం వంటి అంశాల్లో ప్రతి ఆశ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.సారంగం, డా.లక్ష్మినారయన,డా.నాగేశ్వర్ రావు,డిప్యూటీ డెమో కే.ప్రసాద్, కే.వి.రాజు హెల్త్ ఎద్యుకేటర్ ,రామకృష్ణ హెచ్.ఇ.ఒ.,నిలోహణ డి.పీ.ఒ, సౌమిత్ డి.డి.ఎం , సక్కుబాయి ఇంచార్జి డి.ఫై.హెచ్.యెన్.ఒ, వైద్య అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మాపై కక్షతో నా భర్తను సస్పెండ్ చేయించారు

- గోపాల్ పేట సర్పంచ్ అభ్యర్థి కర్రోళ్ల స్వప్న భాస్కర్



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 2 (నినాదం):** దళితులపై కక్ష సాధింపు చర్యలతో హైదరాబాదులోని ఫిలింనగర్ లో లైన్మెన్ గా విధులు నిర్వర్తిస్తున్న నా భర్త కర్రోళ్ల భాస్కర్ ను కాంగ్రెస్ ప్రభుత్వం విధులకు హాజరు కాలేదనే సాకుతో సస్పెండ్ చేశారని గోపాల్ పేట సర్పంచ్ అభ్యర్థి కర్రోళ్ల స్వప్న భాస్కర్ ఆరోపించారు. మంగళవారం వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళితులకు పెద్దపీట వేయాలనే ఆలోచనతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గోపాల్ పేట గ్రామానికి సర్పంచ్ గా జనరల్ సీటు ఉన్న దళితులకు అవకాశం ఇవ్వలని నన్ను ప్రోత్సహించడంతో సర్పంచ్ గా నామినేషన్ వేశానని చెప్పారు.గత ఐదు సంవత్సరాల నుండి కర్రోళ భాస్కర్ గోపాల్ పేట గ్రామానికి ఎంతో సేవలు చేస్తున్నాడని, అలాగే బీదవారికి ఆర్థిక సహాయాలు చేస్తూ గొప్ప మనసున్న వ్యక్తిగా గ్రామ ప్రజల మనసుల్లో చోటు సంపాదించుకున్నాడని చెప్పారు. అది జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం మాపై కక్ష సాధింపు చర్యలు చేస్తుందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. కర్రోళ్ళ భాస్కర్ ను సస్పెండ్ చేసిన బయపడేది లేదని, గ్రామానికి చేసిన మా సేవలను ప్రజలు గుర్తించుకొని ప్రచారం చేసిన చేయకున్న మమ్మల్ని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా గోపాల్ పేటలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా సివిల్ సప్లయ్ అధికారిపై లోకాయుక్తలో రాచాల ఫిర్యాదు



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 2 (నినాదం):** వనపర్తి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై రాష్ట్ర లోకాయుక్తలో బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మెన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు.మంగళవారం బషీర్ బాగ్ లోని లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన అనంతరం రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై ఆధారాలతో సహా లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యంత్రాలు, విద్యుత్ కనెక్షన్ లేని రైస్ మిల్లులకు సైతం బియ్యాన్ని కేటాయించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్, విజిలెన్స్ డిజి, సివిల్ సప్లయ్ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ఆయనపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తూ నిబంధనలను పాటిస్తున్న మిల్లులకు బియ్యం కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అధికారి అవినీతికి సహకరిస్తున్న ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు తెలిపారు.కొంత మంది అధికారుల చర్యల కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అలాంటి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని రాచాల కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు గాలిగల్ల సాయిబాబా, చింటు తదితరులు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తా..

- సర్పంచ్ అభ్యర్థి నక్క బంగారయ్య



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 2 (నినాదం):** గ్రామంలో అన్ని సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తానని సర్పంచ్ అభ్యర్థి నక్క బంగారయ్య హామీ ఇచ్చారు. వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం పోలికే పాడు గ్రామంలో మంగళవారం తన అనుచరులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రెండేళ్లుగా గ్రామంలో అభివృద్ధి పనులు కుంటూ పడ్డాయని, మౌలిక వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఏ వార్డులో ఏఏ సమస్యలు ఉన్నాయో తాను గుర్తించానని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో వ్యక్తిగతంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టి వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తానన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేసి మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చానని, అన్ని వర్గాల ప్రజలు నన్ను ఆదరించి గెలిపించాలని కోరారు.

## భ్రమలు తొలిగాయి.. బీఆర్ఎస్‌లో చేరారు.

### నియోజకవర్గానికి నిరంజనుడి నాయకత్వమే శరణ్యం

### పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఖాతాలోకి ఏకగ్రీవ సర్పంచులు

### జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్





**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 2 (నినాదం):** నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసపూర్తి వాగ్దానాల పట్ల అప్రమత్తమై భ్రమలు తొలిగి మళ్ళీ బీఆర్ఎస్ పార్టీ వైపు నాయకులు, ప్రజలు అడుగులు వేస్తున్నారని జిల్లా బీఆర్ఎస్ మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ అన్నారు. నియోజకవర్గంలో మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, ద్వితీయశ్రేణి నాయకులు తమ పంథా మార్చుకొని అభివృద్ధి ప్రదాత మాజీమంత్రి నీళ్ల నిరంజనుడి నాయకత్వం శరణ్యం అని బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు.ఇందుకు ఉదాహరణగా పార్టీలోకి భారీగా వలసలు కొనసాగుతుండడమే నిదర్శనం అన్నారు.గత 8నెలల క్రింద కాంగ్రెస్ పార్టీలో చేరిన బలమైన నాయకులు జాంప్లా నాయక్ తిరిగి పెద్ద ఎత్తున తన అనుచరులతో బిఆర్ఎస్ పార్టీలో చేరారని,బుద్ధారం మాజీ ఎంపిటిసి విష్ణువర్ధన్ రావు, కోతులకుంట తాండా నుండి పాండు నాయక్, పాతపల్లి గ్రామం నుండి చైతన్య భారతి తమ అనుచరులతో నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.రైతు పక్షపాతిగా 1 లక్ష 17 వేల ఎకరాలకు సాగు నీళ్లు ఇచ్చి రైతులకు రైతు భరోసా, రైతు రుణ మాఫీ రైతు బీమా, మద్దతు ధర కల్పించి రైతును రారాజుగా నిలిపిన నిరంజన్ రెడ్డికి పల్లె ప్రజలు నీరాజనం పలుకుతున్నారని ఆయన గుర్తు చేశారు. వలసల జోరు చూస్తుంటే, ఎన్నికలకు ముందే ఏకగ్రీవంగా అవుతున్న బిఆర్ఎస్ అభ్యర్థులను చూస్తుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయ దుందుభి మోగిస్తోందని జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ధీమా వ్యక్తం చేశారు.కెసిఆర్ సుపరిపాలన, నిరంజనుడి ప్రజా పాలన మళ్ళీ రావాలంటే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని నందిమల్ల అశోక్ పిలుపునిచ్చారు.

## బొబ్బగట్టు చెరువులో మృతదేహం గుర్తింపు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని బొబ్బగట్టు చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. భూపాలపల్లి పట్టణ సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మంగళవారం ఉదయం బొబ్బగట్టు చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతున్నట్లు తమకు సమాచారం అందిందని భూపాలపల్లి మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ గుండు ప్రశాంత్ ఫిర్యాదు అందజేయగా, చెరువులో చేపలు వేటకు వెళ్లిన కుంట్ల స్వామి అనే వ్యక్తి మొదట మృతదేహాన్ని గమనించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న వెంటనే ప్రదేశానికి వెళ్ళి చూడగా పురుషుడిగా కనిపిస్తున్న మృతుడు నీలం రంగు టీ-షర్ట్, నలుపు రంగు ప్యాంట్, కాకి కలర్ సాక్సులు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదని. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని, మృతుడి గుర్తింపు కోసం ప్రజలు సహకరించాలని, ఎవరైనా సమాచారం తెలిసిన పక్షంలో వెంటనే భూపాలపల్లి పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

